లాజరస్ ఊరుపేరు ?" అన్నాడు. మిస్టర్ డేవిడ్ రూపాయి నోటు తిరిగి బైబిలు పటపు పుటలో సర్దుతూ "ఈ రూపాయి నోటు క్రింద వుంది లాజరస్ వూరుపేరు, చదువు" అన్నాడు. పిల్లవాడు రూపాయినోటు తాను తీసికొంటూ పాలెస్టయిన్ పటం చూస్తూ "జెరూసలెమ్" అని చదివాడు.

మిసెస్ డేవిడ్ చిరునవ్వు నవ్వింది. మిస్టర్ డేవిడ్ "వచ్చాం" అని తనటోపీ ధరించుకుంటూ భార్యాటోపీకూడా తానే తీస్ ఆమె నెత్తిమీద వుంచాడు.

మిసెస్ డేవిడ్ "క్యూ" అంది. మిస్టర్ డేవిడ్ రూపాయి నోటు ఆమె కళ్ళమీద వుంచి "జెరూసలెమ్" అన్నాడు. మిసెస్ డేవిడ్ "ఐ ? మై ఐ ? క్యూ" అంది.

.... .... .... .... ....

# మా కెప్పుడూ స్వరాజ్యమే

నదికి వఱద కొత్తగా వచ్చింది. అద్దరినీ ఇద్దరినీ కూడా నవ్యత హెచ్చింది. గట్టనే పచ్చని పచ్చిక మొలిచింది. వాలునే కంప, "కఱ్ఱ" తొడుసు చొప్ప కొట్టుకొనివచ్చి యదోమాదిరి అంచు కట్టులా యమరివుంది. గోధుంవన్నె త్రాచులా యతిరాజసంగా నడుస్తూవుంది నీరు. ఆ నదిమీద పడవే దిగాడో అర్ధరాత్రి, లేక అమరనదీలోయం నుండి ఊడిపడ్డాడో, తెల్లవారేసరికి ఒక కోయపురుషుడు ఒడ్డునే కనబడసాగాడు. తనదే ఆ ప్రవాహం యన్నట్టు తనివిదీఱ స్నానంచేసి, ఒక నల్లనికంబళిగుడ్డ పుట్ట

గోచీ పెట్టుకొని, వాలంలా వెనక్కు వదిలేసి, ఒడలుతుడుచుకు గట్టెక్కి నిలుచుండి, అక్కడే మొలిచి ముది అయిన ఒకానొక నల్లని పెద్ద తాడిచెట్టువంక చూస్తూ విస్తుపోతున్నాడు.

అడవి మనిషికీ పట్నంలోని ఈ తాటిచెట్టంటే ఇంత వింత ఏమాయని ఆలోచించసాగాను నేను.

"దొరా" యని పిలిచాడు నన్ను. "చూశావా ! దొరా ;" అన్నాడు. "ఏమిటి ?" అన్నాను. "ఆ తాటిచెట్టుని ఆ నల్లటి తాటిపండును" అన్నాడు. "ఒకటేం చాలా ఉన్నాయి" యన్నాను నేను. అన్నింటిలోకి పెద్దది పక్కానికి వచ్చిందీ దాన్ని !" యన్నాడు, "ఆఁ చూచాను" యన్నాను. "నన్ను చూచావా ?" అన్నాడు.

అప్పుడుగాని నేను వాని నఖశిఖ పర్యంతం చూడలేదు. మనిషి ఎల్లాయున్నాడూ ?—జగజెట్టిలా కన్ను చెదరిపోయేలా, పిక్కలూ, తొడలూ, భుజమ్మూ, జబ్బలూ, మెడగుళ్ళూ, వెన్ను పట్టీ, యతడూ బలే బలిష్టునిగా దోచేడు. వానిముందు ఆ తాటి చెట్టు ఏపాటిది యన్నట్టుగా ఉన్నాడు. "చూడుదొరా !" అన్నాడు. చూస్తున్నాను. "ఈ దండతో ఆ తాటిని తాకి ఆ తాటి పండును నేలకు పడగొట్టమంటావా ?" అన్నాడు. "పడగొట్ట డంలో ప్రజ్ఞ ఏముంది ? పండి పక్వానికివస్తే కాకతాళీయం యన్నట్టు, కాకివాలేనే పడిపోగలదు తాళఫలం" యన్నాను. నేను, "అదికాదు చూడుదొరా !" యన్నాడు. అని ఒక తాకు తాకి తాటిపండు నేలకు పడేలోపున దోసిట పండు పట్టాడు! దాన్ని. నేలనుపడి కూడా ! పండు పట్టాడు. నేనేకాకుండా యప్పటికప్పుడే యక్కడ మూగిన ముప్పై నలభై మంది జనంకూడా చూచారు. నివ్వెరపోయారు యావన్మందినీ.

పండక్కడపారేసి, కోయదొర, వారెవరివంకా మఱి చూడకుండా, యతిరాజసంగా వెన్ను విరుచుకొని, బుజాన్ని తన సంచీ తగిలించుకుని, సంచీలోంచి నెమలికుంచె, అమ్మలు, ఇలాంటి సామగ్రి కొంతకొంత తొంగిచూస్తూంటే యడుగులు కొల్చుకుంటూ నడువ సాగాడు పూరావేషం ఎక్కడనో వేసికొనే తలంపుతో. ప్రజలు మఱి ఆతణ్ణి వెంటాడించడానికి జడిసి పోయారు. "ఈ కోయదొరవిన్న సాయంత్రానికి లేనివాడు ఈ పొద్దెక్కడనుండి దిగాడు ? పడవా కానం, పాదం కానం !" యని అనుకోసాగారు.

ఆ తాటిపండును ముట్టి పైకెత్తడానికి బ్రాహ్మణులు భయపడ్డారు. క్షత్రియులు బెదరిపోయారు. వైశ్యులు వెఱిచారు. సూద్రులు చూచి చూచి శంకించారు.

ఒక హరిజన యువతిమాత్రం, తాటి చేవకంటే నల్లటిది, చేవతాడికంటె దృఢమైంది, "మీకందరికీ యంత పిరికితనం ఐతే నేను పట్టుకుపోతాను" యని దాన్ని తన నల్లటి కుండలో పెట్టుకుని, వఱద వద్దకు తీసికొనివెళ్ళి, బాడి బత్రా కడిగివేసి. నిండుకుండ నెత్తునెట్టుకు పండు ఒకచేత్తో పైకెత్తి మోచుకుంటూ ఉండుండి రెండో చేతిలోకి మార్చుకుంటూ. ఈవైపు ఆవైపు దిక్కులు చూడ్డానికైనా మెడస్వాధీనం లేనిదై తనవాడకు వెళ్ళింది.

హరిజనవాడ యంటే వేఱే వర్ణించనక్కరలేదు. ఎక్కడ లేని చెట్లు, ఎక్కడలేని పాదులు వాళ్ళ గూడెంలోనే ఏపుగా పెరుగుతాయి. విరివిగా ఉన్నాయి. సందడికూడా హెచ్చు యక్కడే. డప్పుల కాకల కాడనుంచి తప్పులుకట్టేటప్పటి తీర్పు కేకలుదాకా ఆ వాడ ననవరతం మాఱుమోగి పోతూవుంటాయి.

ఒక ముసిలిమాలెత, ఈ యువతిచేతిలోని తాటిపండు చూస్తూ "పడిందంటే ఈ పొద్దు ?" అంది. "నీ వెరుగుదువే ఆ తాడి" యని యువతి తన ముక్కునయున్న ఒక మూడు పొళ్ళ పుడకను మెఱయిస్తూ, అడిగింది. "నాకు తెలవక పోవడం ఏమిటి ? ఆ చెట్టుకంటె ముందు పుట్టినదాన్ని ! నే తిని పారేసిన టెంకను బయలుదేఱిన తాడికాదే ! అది !" అని రెచ్చిపోయింది, తిరిగి యవ్వనం వచ్చిన దానిలా.

అంతట్లో ఆ వెలివాడకు, వెనుకటికోయ దొర నిండు వేషంవేసుకు యడుగులు కొల్చుకుంటూ వెళ్ళాడు. "యయ్యే ఈ పండు చెట్టునుండి పడగొట్టింది ఈ పొద్దు !" అంది యువతి ముసిల్దానితో—ముసిల్ది "ఆడికేం పొయ్యేకాలం వచ్చింది. ఆడికేం వినాశకాలం వచ్చింది. ఆ కాలంలో రాలగొట్టాడే కాయను." అని తూర్పార బోయసాగింది. కోయదొర యతిశాంతంగా యంగలు లెక్కగా నడుస్తూ, తన యమ్ములపొదిలోంచి ఒక అమ్ముతీసి సంధించి యువతి చేతిలోని తాటిపండును గురిచూచి కొట్టాడు. పండు వెళ్ళి ముసిల్దాని పాదాలదగ్గఱ వాలింది. ముసిల్దిది వెంటనే చేటంత ముఖం చేసికొని, "నా పాలిట శ్రీమన్నారాయణమూర్తి వున్నాడు. నన్ను రక్షించాడు. నాముది తాడియొక్క మూడు టెంకల ముద్దులపండును నాకు దక్కించాడు" అంటూ ఆ పండును తన గుడిసెలోనికి తీసికొని వెళ్ళింది.

యువతి కోయదొర వంకకు తిరిగిచూచింది—"స్వరాజ్యం వచ్చింది అనానీమిడిసిపాటు ?" అని కొఱకొఱలాడింది. కోయదొర "మా కెప్పుడూ స్వరాజ్యమే" అంటూ బారెడుబారెడు ఎడంలో మడమలు ఆన్చుకుంటూ అతి దర్జాగా నడచిపోసాగాడు-

యువతి మఱి మాట్లాడితే తననెత్తిమీది కుండకే మోసంరాగల దని తిన్నగా తన గుడిసెలోనికి దూరిపోయింది.

ముసిల్ది ఆ తాటిపండును తన గుడిసెలో ఉట్టిమీద చట్టిలో పెట్టింది. క్రమంగా వెచ్చనన్నం వండుకునే వేళప్పుడు కాల్చుకు తిందామనో ఏమో? పొయి రాజేస్తూవుంది—పొయిరాజేలోగా ఉట్టిమీద చట్టిలో చంటిపిల్లాడి ఏడుపులాగు కుంయి కుంయి, కేరు కేరు; చప్పుడయింది.

ముసిల్ది చట్టిదింపిచూస్తే తాడిపండు చట్టిలో లేదు. తాటి పండంత తలకాయ, అంతనలుపు గల పసిపాప తొణికిసలాడ జొచ్చాడు—అదేం విడ్డూరమోనని యువతిని "ఓలమ్మీ !" అని కూకేసింది. యువతి తన గుడిసెలో ఆసమయానికి ఇండుప కాయ యరగదీస్తూ ఆ జిగురుకుండలో త్రిప్పుతూ, చేతికేవో తగిల్తే పయికితీసిచూస్తూవుంది. ఒకటొకటిగా—మూడు తాటి టెంకలు! పీచూఏచీ యన్నీ ఊడదీసి పారేసిన బోడిటెంకలు! పైకి చేతిలోకి వచ్చినాయి—"ఇదేం! విడ్డూరమే ఓలమ్మీ!" అంటూ యది యివలకు వచ్చి ముసిల్దాన్ని కేకేసింది—

"ఈ పిల్లడు నీ పిల్లడంటే?" యని అంటూ ముసిల్ది తన గుడిసెనుంచి శిశువును యివలకు తీసికొనివచ్చి చూపింది—"పంతుతిని ఈ టెంకలు నా గుడిసెలో పడేశావంటే?" అంటూ యువతి ముసిల్దానిమీదకు గిరాటేసింది—గిరాటేసిన పళంగాం ముసిల్దాని చేతిలోని శిశువు నోరుతెరిచాడు—మూడు టెంకలూ ఒకదాని వెనుకనొకటి ఆ శిశువు కుక్షిలో పడిపోయినాయి—అమాంతంగా శిశువు తాటిపండై దొర్లుకుంటూ దొర్లుకుంటూ, ఏ తాటిచెట్టునుండి రాలగొట్టబడిందో ఆ తాటిచెట్టు ముచ్చికంటా ఎగసి అంటిపెట్టుకూరుకుంది ఎప్పట్లా—

ఊరంతా కనుగొన్నారు ఆ వింతను యతివింతగా మహా వింతగా! ఊరంతా గాలించారు ఆ కోయదొరకోసం—
"మాకెప్పుడు స్వరాజ్యమే!" అన్నవాని యూసుయొక్క ఎదిరియులివు తప్పిస్తే, మఱి దాని యజాలేదు పజాలేదు ఎటు చూచినా ఎంతవెదకినా!

కోయదొర యంతచేటు మటుమాయమై చన్నాగానీ, "యువతిది తప్పా? ముత్తవ్వదితప్పా?" అని చెట్టుక్రింద విచారణమాత్రం ఆ హరిజనవాడలో ఇప్పటికీతప్పలే! తాటిచెట్టు ఆకులు టపటప కొట్టుకోడం మానలే!

.... .... .... .... ....

## సముద్రమ్మీద పెద్దనీడ

"ఓడకంటె ఘనమైనదిగా దోచెన్
నీడ! ఆ నీడ! నీటిమీద నీడ!
మున్నీటిమీద నీడ?—
నా నీడ కాదు చూడ,
నీ నీడ కాదుకూడ
మేడ నీడ కాదు,
చేదె నీడ కాదు,
మేడమీద చేదెదేమొ?
కాదు! కాదు!"

ఇలాగ్గా తలపోస్తూ దిక్కులన్నీ కలయజూచాను. తుద కాకాశమ్మీద కానగల్గాను. కాదంబినీమాల నొకదాన్ని. మేఘం పట్నం మీద నుంది. నీడ సముద్రంమీద నుంది. నీడపట్టు, మేఘంపట్టు తప్పిస్తే, మిగతా ఆకాశంమిగతా అవని సమస్తం సవితృతేజాన్ని విరాజిల్లుతూన్నాయి.